
సాక్షి గుంటూరు

సోమవారం ¦ 13 ¦ జనవరి ¦ 2025



పొనుగుపాడులో పోలీస్ పికెట్

ఫిరంగిపురం: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పొనుగుపాడులో పికెట్ ఏర్పాటు చేశారు. చర్చి సమీపంలోని గోడను శని వారం జేసీబీతో కూల్చిన విషయం తెలిసిందే.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 564.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,800 క్యూసెక్కులు వదిలారు.

రాహుకేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాహు-కేతు పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

న్యూస్‌రీల్

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ భగవద్గీతను దైనందిన కార్యక్రమాల్లో ఆచరించాలని ఆధ్యాత్మికవేత్త శ్రీ ధనేశ్వర దాస్‌గోస్వామి (యూఎస్‌ఏ) అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధనేశ్వరదాస్ గోస్వామి మాట్లాడుతూ ప్రపంచానికి భగవద్గీత అవసరం ఉందని అన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం దాని ద్వారా లభిస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌జీబీ పార్థసారథి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద అందరికీ స్ఫూర్తి ప్రదాత అన్నారు. కార్యక్రమంలో మురారి దాస్ స్వామి, నిర్వికల్పానానంద స్వామి, బార్ అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ ఉపాధ్యక్షుడు జి.శాంతకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి వ్యవసాయ క్షేత్రంలో భోగి మంటలు



తెనాలిరూరల్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మండలంలోని పెదరావూరు గ్రామంలో మనోహర్‌కు గల వ్యవసాయ క్షేత్రంలో భోగి వేడుకలను ఆదివారం ప్రారంభించారు. మంత్రి భోగి మంటలను వెలిగించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఈ నెల 13వ తేదీన జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను భోగి పండుగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

51,059 హెక్టార్లలో రబీ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు 70,324 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 51,059 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గత అక్టోబర్ మూడవ వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 854 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 771 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 19,130కుగాను 7,781, మొక్కజొన్న 20,386కుగాను 14,850, కంది 54కుగాను 149, పెసర 10,516కుగాను 5,177, మినుము 5,833కుగాను 5,406, మంచిశనగ 7,970కుగాను 6,289, పొగాకు 924కుగాను 3,369 హెక్టార్లలో సాగు చేశారు. మిరప 6,978, పండ్ల తోటలు 7, కూరగాయలు 157, ఉల్లి 69, ఇతర పంటలు 56 హెక్టార్లలో సాగు చేశారు.

గోదాదేవికి సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారంతో ఈ ఉత్సవాలు 28వ రోజుకు చేరుకున్నాయి. సుమారు 170 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారు. చిన్నజీయర్‌స్వామి వారికి మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డీజీ రామకృష్ణ పాల్గొని స్వామి వారి మంగళా శాసనాలు అందుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

కళ తప్పిన సంక్రాంతి

- పండుగ శోభ లేని పల్లెటూళ్లు
- ధాన్యానికి గిట్టుబాటు ధర కరవు
- పత్తి కొనే నాథుడే లేరు
- గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు రద్దు
- కూటమి సర్కార్ సాయం శూన్యం
- పేద, మధ్య తరగతి వారికి కష్టాలు
- రోజువారీ అరకొర సంపాదనే ఆధారం
- దుస్తులు, నరకులు కొనుక్కోలేని దుస్థితి
- పండుగ వేళ కనిపించని సంతోషం

పల్లెలు వెలవెలబోతున్నాయి. ఎక్కడా సంక్రాంతి కళ లేకుండా పోయింది. దీనికంతటికి కారణం జనం వద్ద డబ్బులు లేకపోవడమే. రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, కూలీలకు దొరకని పనులు, సంక్షేమ పథకాలు అమలు నిలిపివేతతో డబ్బులు రొటేషన్ కావడం లేదు. దీనిపై వ్యాపారులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి బృందం' తురకపాలెంలో ఆదివారం పర్యటించింది. ఎక్కడా పండుగ వాతావరణం లేదని గ్రామస్తులు వాపోయారు. గత ఐదేళ్లు సంక్షేమం అమలుతో సంక్రాంతి ఒక వేడుకగా జరిగేది. ఇప్పుడా పరిస్థితి మారింది. చేతిలో డబ్బుల్లేక రైతులు, మహిళలు, ఇతర వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారు.



విలేజ్ క్లినిక్

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి,ప్రతినిధి, గుంటూరు: ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు నగరానికి దగ్గరలో ఉన్న ఒక చిన్న పల్లెటూరు తురకపాలెం. తురకపాలెం గ్రామం జనాభా 2,700 మంది. అందులో కాపు సామాజిక వర్గం 720, రెడ్డి 100, ఎస్సీ 750, బీసీ 600, ముస్లిం మైనారిటీలు 100, కమ్మ సామాజిక వర్గం వారు 40 మంది వరకూ ఉంటారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామం సర్వతోముఖాభివృద్ధి సాధించింది. అందరికీ సంక్షేమ పథకాలు అందాయి. రూ.కోట్ల నిధులు వచ్చాయి. ప్రజల ఖాతాల్లో ఏడాదిలో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఏదో ఒక రూపంలో నిధులు వచ్చాయి. నేటి వరకూ కూటమి ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదు.

చుక్కల్లో నిత్యావసర సరకుల ధరలు

గ్రామంలో పండగ పూట సామాన్యులకు నిత్యావసర సరకుల ధరలు షాకిస్తున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు పిండి వంటలకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వంటనూనె ధరలు రోజు రోజుకు సలసలా కాగుతున్నాయి. నెలల వ్యవధిలో నూనె ధరలు 10 నుంచి 15 శాతం పెరిగాయి. ఇక బియ్యం, గోధుమ పిండి, శనగపప్పు, కందిపప్పు, మినప పప్పు, పెసర పప్పు, చక్కెర, బెల్లం తదితరాల ధరలన్నీ చుక్కలనంటాయి. దాదాపు 10 నుంచి 15 శాతానికి పైగా ధరలు పెరిగాయి. ప్రభుత్వమైనా కానుకలు ఇచ్చిందా అంటే అదీ లేదు. కనీసం రేషన్ డిపోల్లో పప్పులు కూడా అందరికీ ఇవ్వలేదు.

ఆదాయంపైనే ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం మాత్రం ఏరులై పారుతోంది. అధికారికంగా బెల్ట్‌షాపులు లేకపోయినా చాలా చోట్ల మద్యం కావాల్సినంత 24 గంటలూ అందుబాటులో ఉంది. పదుల సంఖ్యలో మందు బాటిళ్లు తీసుకువచ్చి ఇళ్లలో పెట్టుకుని తమకు తెలిసిన వారికి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. గత ఐదేళ్లు సంక్షేమ పథకాల వల్ల ఎంతో కొంత డబ్బు పండగ సమయంలో చేతిలో ఉండేదని, ఈ ఏడాది ఆ భాగ్యం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదు. మహిళలకు ఆసరా డబ్బులు పడలేదు. పిల్లలకు అమ్మ ఒడి వేయలేదు. డబ్బుల్లేకుండా పండుగ ఎలా చేసుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ...

గత ప్రభుత్వంలో ప్రతి నెల ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ప్రజలకు నేరుగా ఖాతాల్లో నగదు జమ అయ్యేదని పలువురు గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా పేదలకు అందలేదని ప్రజలు అనుకుంటున్నారు. గ్రామం మొత్తం గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పథకాలైన అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, పింఛన్‌లు, ఆసరా... ఇలా మొత్తం ఏటా రూ.కోటి చొప్పున ప్రజలకు లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. ఇవి కాకుండా సీసీ రోడ్లు, డ్రైన్‌లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు కూడా సుమారు మరో రూ. 5 కోట్లతో అభివృద్ధి పనులు జరిగినట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఇలా ఈ గ్రామానికి మాత్రమే సుమారు రూ.10 కోట్ల లబ్ధి చేకూరింది. గత ఐదేళ్లలో ప్రజలు ఎటువంటి సమస్యలు లేకుండా సంక్షేమ పథకాలతో ఆనందంగా జీవించారు.

సంక్షేమ పథకాలు లేక ప్రజలకు అవస్థలు



గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించింది. నగదు కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాకు చేరింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నేటికీ ఒక్క పథకం కూడా ప్రజలకు అందిన పాపానపోలేదు. నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు, విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్యులు పూట గడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పండగ ఖర్చులు భారంగా మారాయి.

– ఇంటూరి పద్మావతి, రూరల్ మండలం ఎంపీపీ

మద్దతు ధరలు లభించక రైతులకు నష్టాలు



రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేక నష్టాలను చవిచూస్తున్నారు. గతంలో మిర్చి ధర రూ. 23 వేల వరకూ ఉండేది. నేడు అదే మిర్చి రూ. 9 వేలకు పడిపోయింది. పత్తిని సీసీఐ ద్వారా రూ.7,750కి కొనుగోలు చేస్తున్నామన్నారు. కానీ క్వింటాకు ఖాతాల్లో రూ.7,200 జమ అవుతున్నాయి. ఇలా అన్ని పంటలకు మద్దతు ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేవారు. నేడు కనీసం ఒక్క బస్తా కూడా రైతులకు రాలేదు.

– మెట్టు శివనాగిరెడ్డి

నాడు ప్రగతి పరుగులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, పాలకేంద్రం, గ్రంథాలయం వంటి నూతన భవనాలు నిర్మించారు. సుమారు ఐదేళ్లలో గ్రామానికి రూ. 5 కోట్ల నిధులు వచ్చాయి. అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఎటువంటి అభివృద్ధి జరగలేదు. పింఛన్లు మాత్రమే 323 ప్రస్తుతం ఇస్తున్నారు. ఇతర సంక్షేమ పథకాల జాడేలేదు. గ్రామంలో అన్నీ వ్యవసాయ కుటుంబాలే. సుమారు 400 ఎకరాల్లో పత్తి పంటను పండిస్తారు. ఆ పంటకు మద్దతు ధర కరవైంది. ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేసి రూ. 7,750 ఇస్తున్నామని ప్రకటించినప్పటికీ రైతుల ఖాతాల్లో మాత్రం క్వింటాకు రూ.7,200 వరకు మాత్రమే జమ అవుతున్నాయని అంటున్నారు. మిరప సుమారు 60 ఎకరాల్లో సాగు చేస్తుంటారు. మిరప తెగుళ్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధర గతంలో రూ 23 వేల వరకు ఉండగా.. నేడు రూ.9 వేలు మాత్రమే ఉందని రైతులు నిరుత్సాహ పడుతున్నారు. పుగాకు, శనగ సాగు చేస్తారు. రైతులు తాము పడించిన పంటలకు మద్దతు ధర లేదని నిరాశలో ఉన్నారు. ఎకరా పత్తి సాగు చేస్తే సుమారు రూ.60 వేల నుంచి రూ. 80 వేల వరకు ఖర్చు అవుతుండగా.. దిగుబడి తగ్గిపోయి కనీసం పెట్టుబడి కూడా రావటం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు పండిన పంటలు కూడా పాడయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోవడంతో పాలుపోవడం లేదన్నారు. అన్నదాతా సుఖీభవ కింద ఇస్తామన్న పెట్టుబడి సాయం ఊసే లేదని వాపోయారు.



రైతు సేవా కేంద్రం


పాల వెల్లువ మహిళా డెయిరీ

పేదలకు పెద్ద దిక్కు..!

నాలుగేళ్లుగా అన్నం మింగుడుపడక, మంచినీరు తాగలేక తీవ్ర అనారోగ్యానికి గురైన మచిలీపట్నానికి చెందిన వెంకటమహాలక్ష్మికి గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందెకోటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు రూ. 3 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు.

గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెంకు చెందిన షేక్ మొహమ్మద్ టింబర్ డిపో కార్మికుడు. మెడ ఎడమ వైపున గడ్డతో బాధపడుతూ రాగా జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అరుదైన ట్యూమర్ షానోమాగా నిర్ధారించారు. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను మూడు గంటల సేపు చేసి ప్రాణాలు కాపాడారు. రూ. 5 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు.

- ఏడు జిల్లాల నుంచి నిత్యం జీజీహెచ్‌కు చికిత్స కోసం రోగులు
- స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో క్లిష్టమైన ఆపరేషన్లు
- ఏడాదిలో వైద్య సేవలు అందుకున్నవారు 10 లక్షల మందికిపైనే..

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఏపీలో జీజీహెచ్ పేదల పెద్ద ఆసుపత్రిగా ఉన్న పేరును మరోసారి నిలుపుకొంది. కార్పొరేట్ వైద్య సేవలను సైతం పూర్తి ఉచితంగా రోగులకు అందించి ప్రాణాలకు భరోసా కల్పిస్తోంది. జీజీహెచ్‌లో 2024లో ఓపీలో 8,05,892 మంది, ఇన్‌పేషెంట్ విభాగంలో 63,777 మంది చికిత్స పొందారు. సోమవారం నుంచి శనివారం వరకు రోజూ ఉదయం 9 - సాయంత్రం 4 గంటల వరకు ఓపీ విభాగంలో వైద్యసేవలు అందిస్తున్నారు. రోజూ 2 వేల నుంచి 2,500 మంది రోగులు ఇలా వైద్యసేవలు పొందుతున్నారు. ఆస్పత్రికి సుమారు ఏడు జిల్లాలకు చెందిన రోగులు వస్తున్నారు. అవసరమైన వారిని ఇన్‌పేషెంట్ విభాగం (ఐపీ)లో అడ్మిట్ చేసుకుని వైద్యసేవలను అందిస్తున్నారు. ఏడాదిలో పెద్ద, చిన్న, అత్యవసర ఆపరేషన్లు అన్నీ కలిపి 28,402 చేశారు. సాధారణ వైద్య సేవలతోపాటు, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడంలో, అత్యంత అరుదైన ఆపరేషన్లు చేయడంలో గుంటూరు జీజీహెచ్ రికార్డు సృష్టించింది. అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ సహకారం, నాట్కో ట్రస్టు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు జింఖానా పేరుతో వైద్య కళాశాల, జీజీహెచ్‌కు అందిస్తున్న విరాళాలతో ఆసుపత్రిలో అత్యంత ఖరీదైన ఆపరేషన్లు, వైద్య చికిత్సలు పూర్తి ఉచితంగా లభిస్తున్నాయి. నిపుణులైన సీనియర్ వైద్యులు అత్యధిక సంఖ్యలో ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో సైతం వెనుకగడుగు వేసిన ఆపరేషన్‌లను జీజీహెచ్ వైద్యులు చేసి పేదల ప్రాణాలు కాపాడుతున్నారు.


ఓపీలో క్యూలో నిలుచున్న రోగులు


గుంటూరు జీజీహెచ్

ఉచితంగా కార్పొరేట్ వైద్యం....

కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, రేడియోథెరపీ, ఎమర్జన్సీ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెంటల్, మానసిక వ్యాధుల వైద్యవిభాగాల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఉచితంగా వైద్య సేవలను అందించారు. గుండె బైపాస్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేశారు. జనరల్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ వైద్యులు అరుదైన ఆపరేషన్లు చేశారు. గైనకాలజీ వైద్యులు అత్యంత కష్టమైన కాన్పులను సైతం చేశారు. ఏడాదిలో 2,682 కాన్పులు చేసి తల్లి, బిడ్డ ప్రాణాలు కాపాడారు. రేడియాలజీ వైద్య విభాగంలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, మెమోగ్రామ్ వైద్యపరీక్షలను, పెథాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లలో పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వైద్యసేవలతోపాటుగా దాతల సహాయంతో మధురాన్నం పేరుతో నాణ్యమైన ఆహారాన్ని సైతం రోగులకు ఉచితంగా అందిస్తున్నారు.

అరుదైన ఆపరేషన్‌లతో రికార్డ్



గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసుకునేందుకు భయపడే అత్యంత క్లిష్టమైన కేసులను సైతం అడ్మిట్ చేసుకుని ప్రాణాలు కాపాడేందుకు జీజీహెచ్ వైద్యులు 24 గంటలు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాదిలో పలు అత్యాధునిక వైద్య పద్ధతుల్లో ఆపరేషన్లు చేసి రాష్ట్ర వైద్య చరిత్రలో రికార్డు సృష్టించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు సహకరిస్తున్నారు.

– డాక్టర్ యశస్వి రమణ, సూపరింటెండెంట్, జీజీహెచ్

కోడి పందేలు, పేకాట శిబిరాలపై నిఘా

- డ్రోన్, సీసీ కెమెరాలతో నిత్యం పరిశీలన
- నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరిక



నగరంపాలెం: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, పేకాట, గుండాట, మట్కా ఆడటం, ఆడించడం చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రతిఒక్కరూ సంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలని అన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొంత మంది ప్రజలు పందేలు కాసి కష్టార్జితాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో కోడిపందేలు, జూదం జరగకుండా, ప్రజాప్రయోజనాల దృష్ట్యా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు సాయంతో నిఘా పెడుతున్నట్లు చెప్పారు. గతంలో కోడిపందేలు, పేకాట, మట్కా నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల రక్షణకు ఎల్‌హెచ్‌ఎంఎస్

సంక్రాంతి సెలవుల సందర్భంగా ఇళ్లకు తాళాలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీస్ శాఖ ఉచితంగా అందించే ఎల్‌హెచ్‌ఎంఎస్ వసతిని వాడుకోవాలని అన్నారు. ముందస్తు సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని తెలిపారు. సమాచారమిచ్చిన గృహాలపై నిరంతర పోలీస్ నిఘా, అటువైపు పోలీసుల గస్తీ ఉంటుందని అన్నారు. గస్తీ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది తరచూ ఆ ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. ఇళ్లలోని బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐ, లేదా డయల్ 112కు సమాచారం అందించాలని చెప్పారు.

సమైక్యత చాటిన 'దర్గా టు దుర్గ'

పెదకాకాని: స్వామి వివేకానంద జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు 14వ జాతి సమైక్యతా నడక 'దర్గా టు దుర్గ'ను ఆదివారం నిర్వహించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా వద్ద గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ జెండా ఊపి ఈ పాదయాత్రను ప్రారంభించారు. జైన్ టెంపుల్, డోలాస్ నగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కి.మీ. మేర సాగిన ఈ పాదయాత్రలో కళాశాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు, ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. మార్గమధ్యలోని దేవాలయాలు, చర్చిలలో పూజలు, ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ అన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సంకల్పంతో పని మొదలు పెడితే లక్ష్యాన్ని సాధించగలమన్న నమ్మకం ఈ యాత్ర అందిస్తుందని అన్నారు. విద్యార్థులలో ఐకమత్యం పెంచేందుకు దోహదపడుతుందని అన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంచుకొని ముందుకు సాగాలని సూచించారు. సమాజ సేవకు తమవంతుగా అందరూ ముందుకు రావాలని కోరారు. తద్వారా కన్నవారికి, దేశానికి పేరు తేవాలని కోరారు. సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పాదయాత్రను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

క్లుప్తంగా

31 నుంచి బాల మహోత్సవ్‌-2కే25



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్‌ కార్యక్రమాన్ని జనవరి 31వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైస్‌ చాన్సలర్‌ పి.నాగభూషణ్‌ ఆదివారం తెలిపారు. ఈ మేరకు ''విజ్ఞాన్‌ బాల మహోత్సవ్‌-2కే25'' పేరిట పోస్టర్లను చైర్మన్‌ లావు రత్తయ్య ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. చిన్నారులు ప్రతిభ చాటేందుకు ఈ మహోత్సవ్‌ వేదికగా నిలుస్తుందన్నారు. జూనియర్స్‌ (5 – 7), సీనియర్స్‌ (8 – 10వ తరగతి వరకు) విద్యార్థులకు మొత్తం 50కుపైగా ఈవెంట్లు నిర్వహించనున్నారు. వాలీబాల్‌, కబడ్డీ, ఖో ఖో, పరుగు పందేలు, మ్యూజిక్‌, డ్యాన్స్‌, లిటరరీ, ఫైన్‌ ఆర్ట్స్‌ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయి. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వీసీ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ఎంఎస్‌ రఘునాథన్‌, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం



తాడేపల్లి రూరల్‌ : తాడేపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కనకదుర్గ వారధి కింద కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు ఆదివారం తాడేపల్లి పోలీసులకు మత్స్యకారులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి కనకదుర్గ వారధి కింద 16వ దిమ్మె వద్ద నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి వివరాలు తెలిపే ఎటువంటి ఆధారాలు లభించలేదు. సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, శరీరంపై నల్ల నిక్కర్‌, తెలుపు ఎరుగు అడ్డగీతల టీషర్ట్‌ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 08645-272186 నంబరుకు ఫోన్‌ చేయాలని పోలీసులు కోరారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్‌

పరారీలో మరో ఇద్దరు నిందితులు

లక్ష్మీపురం: గంజాయి విక్రయిస్తున్న వారిని అరండల్‌పేట పోలీసులు ఆదివారం అరెస్ట్‌ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రాంతానికి చెందిన అందుగుల రవికుమార్‌ అనే వ్యక్తి.. శ్రీనగర్‌ 7/4 ప్రాంతానికి చెందిన మండా సుధీర్‌, ఇద్దరు యువకులు, మరో ఇద్దరు మైనర్లతో కలిసి గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు అరండల్‌పేట సీఐ వీరాస్వామి, ఎస్సై కృష్ణబాజీ, సిబ్బందితో కలిసి శనివారం అర్ధరాత్రి శ్రీనగర్‌ ప్రాంతంలో నిఘా పెట్టారు. అదే ప్రాంతంలో ఉన్న మండా సుధీర్‌ వద్ద 1.5 , అందెగుల రవికుమార్‌ 1.3, ఇద్దరు మైనర్ల వద్ద 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించారు. మండా సుధీర్‌, మరో ఇద్దరు, మైనర్లు గ్రామీణ ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి రవికుమార్‌కు ఇస్తున్నారు. ఆ వాహనాల ద్వారా గంజాయిని చింతపల్లి ప్రాంతం నుంచి అతడు తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. రవికుమార్‌ చింతపల్లి నుంచి శనివారం రాత్రి మొత్తం 13 కేజీల గంజాయి తీసుకొచ్చి మిగతావారికి భాగాలుగా అందించాడు. ఈ క్రమంలో అరండల్‌పేట పోలీసులు శ్రీనగర్‌ 7/4వ లైన్‌లో ఆకస్మిక దాడి చేశారు. రవికుమార్‌, సుధీర్‌, ఇద్దరు మైనర్లు దొరికారు. మిగిలిన ఇద్దరు పరారయ్యారు. నిందితులను అరెస్టు చేశారు. 4.9 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మిగిలిన వారు సంజీవయ్యనగర్‌, వసంతరాయపురం, ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేసినట్లు సీఐ తెలిపారు.

జాబ్‌ క్యాలెండర్‌పై కూటమి ప్రభుత్వం మోసం

ఏఐవైఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌ వలి



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఏఐవైఎఫ్‌ నాయకులు

లక్ష్మీపురం: అధికారంలోకి వచ్చిన వెంటనే జనవరి ఒకటో తేదీన నూతన జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో నారా లోకేష్‌ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చినా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మోసగించిందని ఏఐవైఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌ వలి మండిపడ్డారు. కొత్తపేట భగత్‌ సింగ్‌ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్‌ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. ఏవైఎఫ్‌ నగర అధ్యక్షుడు చిన్నపోతుల శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. రాజకీయ నిరుద్యోగులకు మాత్రం అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఆ అవకాశం కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ నాయకులు బి.వెంకటేశ్వర్‌ రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్‌ నగర అధ్యక్ష, కార్యదర్శులు సాయి, ప్రణీత్‌, రెహమాన్‌, మస్తాన్‌ ఏసుబాబు, ఖాసీం, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి క్రమశిక్షణ కీలకం


విద్యార్థినికి చెక్కు అందిస్తున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ అన్నారు. పీజీ, డిగ్రీ, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 114 మంది పోలీస్‌ పిల్లలకు రూ.5.87 లక్షల మేరకు ప్రతిభా పురస్కారాలను తులసి సీడ్స్‌ సంస్థల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పోలీస్‌ కళ్యాణ మండపంలో అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. తులసి సీడ్స్‌ అధినేత రామచంద్ర ప్రభును అభినందించారు. సమాజం బాగు కోసం శ్రమించే పోలీస్‌ శాఖకు అన్నివిధాలా సహకరిస్తామని రామచంద్ర ప్రభు చెప్పారు. సంస్థల ఎండీ తులసి యోగిష్‌చంద్ర మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్‌) ఎ.హనుమంతు, రాష్ట్ర పోలీస్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్‌ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు మైలా సాంబశివరావు, కార్యదర్శి లక్ష్మయ్య, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి బేబీరాణి, కోశాధికారి హుస్సేన్‌, ఎగ్జిక్యూటివ్‌ సభ్యులు షేక్‌ కరిముల్లా, మోషే పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వవిద్యార్థుల బృంద చిత్రం

గుంటూరు రూరల్‌: అనాటి విద్యార్థులు నాడు తాము చదువుకున్న పాఠశాలను చూసి తీపిగుర్తులను నెమరు వేసుకున్నారు. సుమారు 53 సంవత్సరాల తరువాత వారంతా కలిసి తమ ఉపాధ్యాయులను, తోటి మిత్రులను కలుసుకుని సందడి చేశారు. అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 1981 – 86 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు చూసి ఆశ్చర్యపోయారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. 1986లో టీచర్స్‌గా పనిచేసిన సత్యనారాయణ రెడ్డి, వి.శివకుమారి, హిందీ టీచర్‌ వేదాంతం సత్యనారాయణభట్టాచార్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలూరి వెంకటరెడ్డి, సుధా పిచ్చయ్య, శ్యామల అశోక్‌రెడ్డి, బొంతు చంద్రశేఖర్‌రెడ్డి, వజ్రాల వెంకటేశ్వర్‌రెడ్డి, కటారి శ్రీనివాసరావు, లక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, పెరకం విజయ్‌కుమార్‌, నారదాస్‌ కృష్ణారావు, శ్యామల భూలక్ష్మి, ఇందిరాజ్యోతి, నాగమణి, పుష్పలీల, వజ్రాల శివకుమారి, గోగిరెడ్డి పద్మ, మస్తాన్‌బీ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మేడికొండూరు: బైకును గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్‌లోని చంద్రయ్య పెట్రోల్‌ బంకు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఏలూరు జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన భాగ్య రమేష్‌ (30) గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వస్తున్నాడు. చంద్రయ్య పెట్రోలు బంకు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మేడికొండూరు పోలీసులు వచ్చి అతడి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం తరలించారు.

విద్యా సంవత్సరం ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలి

నరసరావుపేట ఈస్ట్‌: రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్‌ బెజ్జం సంపత్‌బాబు, సెక్రటరీ జనరల్‌ వి.అశోక్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2017 నుంచి అమలులో ఉన్న ఈ విధానాన్ని వదిలి కటాఫ్‌ తేదీ ప్రాతిపదికన బదిలీలు చేస్తే పల్నాడు వంటి పెద్ద జిల్లాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 2023లో ప్రమోషన్‌ పొందిన సీనియర్లకు న్యాయం చేసే అవకాశం లేదని వివరించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ

మంగళగిరి (తాడేపల్లి రూరల్‌): ప్రీమియర్‌ లీగ్‌, సీజన్‌-3 రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీలను ఆదివారం విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కేశినేని శివనాథ్‌ (చిన్ని) ప్రారంభించారు. మంత్రి నారా లోకేష్‌ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా ప్రైడ్‌ ఆఫ్‌ మంగళగిరి పేరుతో వీటిని నిర్వహిస్తున్నారు. తొలుత చిన్ని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 23వ తేదీన ఫైనల్‌ మ్యాచ్‌ ఉంటుందని, అదే రోజు నగదు బహుమతి , కప్పు అందిస్తామని తెలిపారు. అన్ని జిల్లాల టీమ్‌లు వచ్చాయని అన్నారు. అసోసియేషన్‌ తరఫున యువ క్రీడాకారులకు గ్రౌండ్లు, అకాడమీలు త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం అకాడమీ సిద్ధమైందన్నారు. మంగళగిరిలోని స్టేడియం అభివృద్ధితోపాటు అమరావతిలో నూతన స్టేడియం నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్‌ స్టేడియాన్ని రూ. 50 కోట్లతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్‌ చైర్మన్‌ నందం అబద్దయ్య, ఏపీ మెడికల్‌ సర్వీసెస్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

జీవితంలో విలువలు పాటించిన నటుడు కృష్ణ


కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి మనోహర్‌

తెనాలి: నటుడుగా, నిర్మాతగా, దర్శకుడిగా సూపర్‌స్టార్‌ కృష్ణ అయిదు దశాబ్దాల సినీరంగ ప్రయాణంలో విలువలతో కొనసాగారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ అన్నారు. తెనాలి-విజయవాడ రోడ్డులోని తెనాలి బండ్‌పై ఏర్పాటు చేసిన సూపర్‌స్టార్‌ ఘట్టమనేని శివరామకృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఆలిండియా సూపర్‌స్టార్‌ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్‌ అసోసియేషన్‌, తెనాలి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. కృష్ణ తన సాహసోపేత ప్రయోగాలతో తెలుగు సినిమా స్థాయిని పెంచి, తెలుగు జాతి గర్వించేలా చేశారని చెప్పారు. ఎన్ని హిట్లు వచ్చినప్పటికీ తాను మాత్రం హుందాగానే కొనసాగారన్నారు. పార్లమెంటు సభ్యుడిగా ప్రజా జీవితంలోనూ నిస్వార్థ సేవ చేశారని తెలిపారు. కృష్ణ పాటించిన విలువలు నేటి తరానికి ఆదర్శమన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ మాట్లాడుతూ సినిమా రంగంలో తెలుగువారి సత్తా ప్రపంచానికి చాటిన నటుడు కృష్ణ అని చెప్పారు. ప్రముఖ సినీనిర్మాత, పద్మాలయ స్టూడియోస్‌ అధినేత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ.. తెనాలితో తమ ముగ్గురు సోదరులకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. తెనాలిలోని ప్రతి వీధి, ఇక్కడి ప్రముఖులతో ఉన్న బంధాన్ని నెమరువేసుకున్నారు. తన సోదరుడు సూపర్‌స్టార్‌ కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ గోగినేని ఉమ, సినీ నిర్మాత, వీఎస్సార్‌ అండ్‌ ఎన్‌వీఆర్‌ కాలేజీ కరస్పాండెంట్‌ నన్నపనేని సుధాకర్‌, ఈదర పూర్ణచంద్‌, పెమ్మసాని రవిబాబు, హీరో మహేష్‌బాబు సోదరులు ఘట్టమనేని రాఘవరత్నబాబు, నరసయ్యబాబు పాల్గొన్నారు. ఆలిండియా సూపర్‌స్టార్‌ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్‌ అసోసియేషన్‌ తరఫున కె.యశ్వంత్‌కుమార్‌, షబ్బీర్‌ అఖిల్‌ పర్యవేక్షించారు. పలువురు కృష్ణ అభిమానులు ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

టీటీడీ నిత్య అన్నదానానికి కూరగాయలు అందజేత



తాడేపల్లిరూరల్‌: తిరుమల శ్రీవారి భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో భాగంగా తాడేపల్లిలోని రివర్‌ బ్రీజ్‌ అపార్ట్‌మెంట్‌ వాసులు కూరగాయలను ఆదివారం అందజేశారు. రివర్‌ బ్రీజ్‌ వాసుల సహకారంతో 10 టన్నుల కూరగాయల వాహనానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రాతూరు నాగభూషణం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్‌ వాసులు వి.కోటేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, వీఆర్‌కె ప్రసాద్‌, జగదీష్‌, ఉపేంద్ర తదితరులతో పాటు ధార్మిక, ఆధ్యాత్మిక వాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ


చెక్కు అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

గుంటూరు ఎడ్యుకేషన్‌: దాతల ఆర్థిక సహకారంతో చదువుకుంటున్న విద్యార్థులు సమాజానికి మంచి చేసే పౌరులుగా ఎదగాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్‌ కేవీపీ పబ్లిక్‌ స్కూల్లో శ్రీ కాకతీయ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సంఘం కార్యదర్శి డాక్టర్‌ కె.కృష్ణప్రసాద్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుని గొప్ప స్థాయికి చేరాలన్నారు. సంఘం చైర్మన్‌ డాక్టర్‌ కొండబోలు బసవపున్నయ్య, సమన్వయకర్త నామినేని కోటేశ్వరరావులు మాట్లాడుతూ.. ప్రస్తుత 22వ ఏడాది కార్యక్రమం వరకు సంఘం తరఫున రూ.ఎనిమిది కోట్ల మేరకు ఉపకార వేతనాలను అందించామని చెప్పారు. సంఘ కోశాధికారి డాక్టర్‌ పుట్టగుంట వేణుగోపాలరావు రూ.కోటి, డాక్టర్‌ మద్దినేని గోపాలకృష్ణ రూ.22 లక్షలు, జాస్తి వెంకటేశ్వర్లు కుటుంబం రూ.68 లక్షలు, కొందరు దాతలు సహాయం చేశారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, వడ్లమూడి గోవర్ధనరావు, టీటీడీ సభ్యుడు నన్నపనేని సదాశివరావు, బొప్పన ద్వారకా ప్రసాద్‌, రాయపాటి గోపాలకృష్ణ, కె. వెంకట్రావు, జి. రత్తయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదు


మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్‌: గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం తగదని, యూటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృష్ణా-గుంటూరు జిల్లాల పీడీఎఫ్‌ గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీగా కేఎస్‌ లక్ష్మణరావును తిరిగి గెలిపించుకుందామని తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్‌ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం ముఖ్యుల సమావేశాన్ని సంఘ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2007 నుంచి పీడీఎఫ్‌ ఎమ్మెల్సీలు ప్రజల పక్షాన నిలిచి, ప్రజాతంత్ర హక్కులను కాపాడడం కోసం కృషి చేశారని తెలిపారు. యూటీఎఫ్‌ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్‌ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ... ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేస్తే విజయం ఖాయమని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడం తగదన్నారు. యూటీఎఫ్‌ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌, ఎం.కళాధర్‌లు మాట్లాడుతూ... విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్‌ జిల్లా సహాధ్యక్షురాలు వై.నాగమణి, కోశాధికారి ఎండీ దౌలా, నాయకులు సీహెచ్‌ ఆదినారాయణ, బి.ప్రసాదు, కోటిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గోపయ్య, రమేష్‌, శ్రీనివాస్‌ కార్తీక్‌, శ్రీనివాసరావు, ఉదయభాస్కర్‌, ఆదం సాహెబ్‌, కిషోర్‌, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్‌: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పెదవడ్లపూడి స్టేషన్‌ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి తాంబరం రైల్లో రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి ఒంటిపై తెల్ల చొక్కా ఉంది. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు.